

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

జేఈఈ మెయిన్స్ పరీక్ష తొలిరోజు మంగళవారం ప్రశాంతంగా సాగింది. ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించారు.

- 8లో..



ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం

ఇద్దరు యువకులను ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు బలి తీసుకుంది.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
31 /22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 14 వీర జవాన్ల దినోత్సవంగా నిర్వహించాలి

సాక్షి, న్యూఢిల్లీ: పుల్వామా అమరవీరుల గుర్తుగా ఫిబ్రవరి 14ని వీర జవాన్ల దినోత్సవంగా నిర్వహించాలని ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన ఎంబీఏ విద్యార్థి కీర్తి నాయుడు కోరారు. 2019లో పుల్వామాలో తీవ్రవాదుల దాడికి నిరసనగా అశువులు బాసిన వీరజవాన్లకు నివాళులర్పించి, దేశ ప్రజలంతా శ్రద్ధాంజలి ఘటించాలన్న అవగాహన అందించేందుకు ఒంగోలు నుంచి సైకిల్ యాత్ర చేపట్టిన కీర్తి నాయుడు మంగళవారం ఢిల్లీ చేరుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ..జనవరి 1న ఒంగోలు కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర 24 రోజుల్లో తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల మీదుగా 2,000 కిలోమీటర్లు ప్రయాణించి ఢిల్లీ చేరుకున్నట్లు తెలిపారు. పుల్వామా దాడి ఘటనలో అశువులు బాసిన 40 మంది వీర జవాన్లకు ప్రతి ఒక్కరూ నివాళులర్పించాలన్న అవగాహన కల్పించేందుకే సైకిల్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు.

సచివాలయాల్లో బయోమెట్రిక్ తప్పనిసరి



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది ఉదయం, సాయంత్రం కచ్చితంగా బయోమెట్రిక్ హాజరు వేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రకాశం భవనం నుంచి మంగళవారం మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు. కల్యాణమస్తు పథకానికి సంబంధించిన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. వైఎస్సార్ బీమా పథకం లబ్ధిదారుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. జగనన్న తోడు పథకంలో మంజూరైన రుణాలను లబ్ధిదారులకు అందించడంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చే అర్జీలను పరిష్కరించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను సంబంధిత అధికారులు విధిగా పరిశీలించాలన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు వేయడం లాంటిది మరొకటి లేదు– నేను తప్పకుండా ఓటు వేస్తాను అనే నినాదంతో బుధవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించాలన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ అవసరమైన గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించడంపై నివేదిక అందించాలని తహసీల్దార్లను ఆదేశించారు. కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ కార్డులను అందించాలన్నారు. జగనన్న ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులు చనిపోతే చట్టబద్ధ వారసులను గుర్తించి వారికి స్థలాలను అందించాలన్నారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఈడీ పరీక్షకు 12 మంది గైర్హాజరు

ఒంగోలు: డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈడీ) తొలి సెమిస్టర్ పరీక్షకు మంగళవారం 12 మంది గైర్హాజరయ్యారు. స్థానిక సెయింట్ థెరెస్సా పరీక్ష కేంద్రంలో మంగళవారం 164 మంది కావాల్సి ఉండగా 152 మంది హాజరయ్యారు. పరీక్షలను పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని డీఈఓ బి.విజయభాస్కర్ తెలిపారు.

తెలుగు బాషా పండిత శిక్షణార్థుల పరీక్షకు 28 మంది గైర్హాజరు..

స్థానిక సీఎస్‌ఆర్ శర్మ కాలేజీలో జరుగుతున్న తెలుగు బాషా పండితుల పరీక్షకు 28 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 135 మంది హాజరుకావాల్సి ఉండగా 107 మంది హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు డీఈఓ తెలిపారు.

అక్రమ మద్యం సీజ్

కంభం: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని తుడిమెళ్ల గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. రాచర్ల గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అక్రమంగా మద్యం బాటిళ్లను కొనుగోలు చేసుకుని తరలిస్తున్నారని సమాచారం అందడంతో ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ముగ్గురు నిందితులను తుడిమెళ్ల గ్రామ సమీపంలో అదుపులోకి తీసుకుని అక్రమంగా తరలిస్తున్న 108 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్ఈబీ ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

ఎర్ర తేజం



పొలాల్లో ఆరబెట్టిన మిర్చి

- గుంటూరు యార్డులో జిల్లా మిర్చికి మంచి రేటు
- క్వింటా రూ. 22వేల నుంచి రూ.25 వేలు
- రైతుల్లో ఆనందం
- పశ్చిమ ప్రకాశంలో అత్యధిక సాగు

మార్కాపురం: రైతులు ఎర్ర బంగారంగా భావించే మిర్చికి గుంటూరు మార్కెట్‌లో మంచి మద్దతు ధర లభిస్తోంది. ఖరీఫ్, రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 32,176 హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. అత్యధికంగా పశ్చిమ ప్రకాశంలో సాగు ఎక్కువగా ఉంది. ఈ ఏడాది రైతులు ఎక్కువగా తేజ యూ 5341 రకాన్ని సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ. 1.25 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేశారు. 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రైతులందరూ ఎకరాకు మూడు కోతలు తీశారు. దాదాపుగా 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. ఇంకా రెండు కోతల వరకు మిర్చి కోసే అవకాశం ఉంది. అయితే ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు తెగుళ్ల సోకినప్పటికీ ప్రభుత్వం ఆర్‌బీకేలో ఉన్న సిబ్బంది ద్వారా సలహాలు, సూచనలు పాటించడంతో రైతులు తెగుళ్ల ముప్పు నుంచి బయటపడ్డారు. అక్కడక్కడ నల్లతామర పురుగు కనిపించినా సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి నల్లతామర పురుగు నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం గుంటూరు మార్కెట్‌యార్డులో మిర్చి నాణ్యతను బట్టి ధర లభిస్తోంది. ఆర్మూరు, సింజెంటా, కొత్త బాడిగి, డీలక్స్, కొత్త వి బంగారం, కొత్త వి తేజతాలు రకాలు, 341 రకాలు మార్కెట్‌కు వస్తున్నాయి. వీటిలో తేజ, ఆర్మూరు, బాడిగి, సింజెంటా రకాలకు క్వింటా రూ.22 వేల నుంచి రూ.25 వేల వరకు ధర పలుకుతున్నాయి. గత సీజన్‌లో ఫిబ్రవరిలో క్వింటా రూ. 19 వేల నుంచి రూ.21 వేల మధ్య ధర పలికింది. ఈ దఫా ప్రారంభంలోనే మంచి ధర లభిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో సాగు ఇలా

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో 32,176 హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. ఒంగోలు సబ్ డివిజన్‌లో 339, దర్శిలో 4,714, మద్దిపాడులో 745, మార్కాపురంలో 5,312, వైపాలెంలో 11,512, గిద్దలూరు పరిధిలో 1510, కనిగిరి పరిధిలో 801, సింగరాయకొండ పరిధిలో 427 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుచేశారు. పశ్చిమ ప్రకాశంలోని మూడు సబ్ డివిజన్‌లలో 18,334 హెక్టార్లలో సాగు చేశారు.

మిర్చి రైతుల పంట పండింది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు పంటకు తెగుళ్ల సోకాయి. సకాలంలో రైతులు స్పందించి ఆర్‌బీకేల నుంచి వచ్చిన సూచనలను పాటించారు. నాణ్యమైన పురుగుల మందులు వాడి తెగుళ్ల బారి నుంచి బయటపడ్డారు. గుంటూరు మార్కెట్ యార్డులో ఊహించని దాని కంటే ధర ఎక్కువ వస్తుండడంతో మిర్చి రైతుల ఆనందానికి అవధుల్లేవు. ఇప్పటికే మూడు కోతలు కోశారు. ఉగాది వరకు మరో రెండు కోతలు కాయాల్సి ఉంది.



మిర్చిని బస్తాలలోకి ఎక్కిస్తున్న రైతులు

సస్యరక్షణ చర్యలు పాటించండి



ప్రస్తుత పరిస్థితుల్లో మిర్చి రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. తెగుళ్లకు ఇష్టమొచ్చినట్లుగా మందులు వాడొద్దు. తామర పురుగు సోకితే వ్యవసాయాధికారి సలహాలతోనే మందులు వాడాలి. యార్డుకు తీసుకెళ్లే ముందు కాయ నాణ్యతను చూసుకోవాలి. బయట ఆరబెట్టేటప్పుడు తడవకుండా, మట్టి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

20 క్వింటాళ్లు అమ్మాను

5 ఎకరాల్లో మిర్చి పంట సాగుచేశాను. మొదటి కోతలోనే దాదాపు 20 క్వింటాళ్లు గుంటూరు మార్కెట్‌యార్డుకు తీసుకెళ్లి అమ్మాను. క్వింటా నాణ్యతను బట్టి రూ.20 వేల నుంచి రూ. 22 వేల మధ్య అమ్మాను. ఇంకా ఉగాది వరకూ పంట కోతలు వస్తాయి.

– ఆవులయ్య, రైతు, వేములకోట

మనది పేదల ప్రభుత్వం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

- వారి రుణం తీర్చుకోవడమే లక్ష్యంగా పనిచేద్దాం
- తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడదాం
- జగనన్న ఆశయంలో భాగంగా భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీకి పట్టం కడదాం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: మనది పేదల ప్రభుత్వం, వారి రుణం తీర్చుకోవడమే లక్ష్యంగా పనిచేద్దామని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎంహెచ్‌ఆర్ ఫంక్షన్‌హాలులో మంగళవారం జరిగిన వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాతికేళ్లుగా మంచినీటి ఎద్దడి కోసం ప్రజలు పడుతున్న పాట్లను తొలగించడమే లక్ష్యంగా సీఎంకు విజ్ఞప్తి చేశా. అడిగిందే తడవుగా రూ.339కోట్లు మంజూరు చేశారని, ఇందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఒంగోలు ప్రజానీకం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తప్పుడు వాగ్దానాలు, తప్పుడు ప్రచారం, ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని అడ్డుకునే కుట్రదారులకు సరైన రీతిలో బుద్ధి చెప్పేందుకు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ హయాంలో పెన్షన్లకు వృద్ధులను ఎలా పీడించిందో అందరికీ తెలుసన్నారు. అటువంటి దుస్థితికి కాలం చెల్లేలా చేసి పొద్దు పొడవక ముందే అవ్వా తాత చేతికి నగదు అందిస్తున్న ప్రభుత్వం మనది అన్నారు. కరోనా సమయంలో ఎంతో చేశామో అందరికీ తెలుసని, ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేసే నాయకులు ఆ రోజు ఏమయ్యారని ప్రజలు నిలదీయాలన్నారు. టీడీపీ నాయకులు అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు సచివాలయ మండల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు కూడా తోడైనందున భారీ మెజార్టీ లక్ష్యంగా వైఎస్సార్ సీపీని గెలిపించుకుని జగనన్నకు కృతజ్ఞతలు చెప్పుకుందామని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం అప్పులు చేసి టీడీపీ వాళ్ల జేబులు నింపుకున్నారని, మన ప్రభుత్వంలో ప్రతి పైసా పేదవాని సంక్షేమం, ఆరోగ్యం, అభివృద్ధికే అన్నారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్లు భూమన కరుణాకర్‌రెడ్డి, బీదా మస్తాన్‌రావులు మాట్లాడుతూ ఒంగోలు వైఎస్సార్ సీపీకి కంచుకోట అన్నారు. బాలినేని అంటేనే ఒంగోలు ప్రజానీకం హృదయాలు ఉప్పొంగుతాయని, అటువంటి నాయకుని సేవలు రాష్ట్రం మొత్తానికి అవసరమన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో ప్రభుత్వ పరంగానే కాకుండా బాలినేని వ్యక్తిగతంగా కూడా ప్రజలకు అండగా ఉంటున్న తీరు ప్రశంసనీయమన్నారు. ఏ చిన్న సమస్యను నిర్లక్ష్యం చేయకుండా విజయమే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో అబద్ధాలనే పదే పదే చెప్పడం ద్వారా చంద్రబాబు ప్రజలను నమ్మించాలని చూడడం అలవాటు అని, అటువంటి వారికి సరైన రీతిలో గుణపాఠం చెపేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ 175/175 అన్న జగన్‌మోహన్‌రెడ్డి పిలుపును సాకారం చేసేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఒక్కో ఇంటికి ఎంతెంత లబ్ధి అందుతుంది తెలియజేస్తూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మనది పేదల ప్రభుత్వమని, అందుకే వారి స్థితిగతులను మార్చేందుకు, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఒంగోలు నియోజకవర్గ పరిశీలకుడు ఆదిశేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీదా మస్తాన్‌రావు మీడియాతో మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఎంతటి త్యాగానికైనా వెనుకాడని వ్యక్తి బాలినేని అని, ఆయన సైన్యంలో ఉత్సాహం కదం తొక్కుతుందన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు

సమన్వయంతో ముందుకు సాగుదాం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

నాగులుప్పలపాడు(మద్దిపాడు): పార్టీలో అందరినీ కలుపుకుపోతూ సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మండలంలోని పోతవరం గ్రామంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్టీని బలోపేతం చేసుకుంటూ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూసుకోవాలని పిలుపునిచ్చారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని చెప్పారు. ప్రతి నెల ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛన్లు ఇంటికే వస్తున్నాయన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో అందరినీ కలుపుకుపోతూ పార్టీకి కంచుకోటలా తయారు చేస్తున్నామన్నారు. తొలుత ఎమ్మెల్యేకి గ్రామ నాయకులు ఘన స్వాగతం పలికి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యకర్త రాజీవ్‌రెడ్డి ఇంట అల్పాహారం తీసుకున్న ఎమ్మెల్యే అక్కడ నుంచి మార్గమధ్యంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం గడప గడపలో ప్రభుత్వ పథకాలను వివరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. కార్యక్రమంలో వారి వెంట ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ మారెళ్ల వెంకట శేషయ్య, మండల అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, జెడ్పీటీసీలు యాదాల రత్నభారతి, వేమా శ్రీనివాసరావు, మాజీ మండల అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, డైరెక్టర్లు నారా విజయలక్ష్మి చెన్న కేశవులు, సొసైటీ అధ్యక్షుడు ఇనగంటి రమణారెడ్డి, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, భారత పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ శీలం రేణుక సురేష్, మారెళ్ల కిరణ్, ముద్దన రాజేశ్వరరావు, పార్టీ నాయకులు జెట్టి శ్రీను, వాసుపంతులు మద్దిసాన నాగేశ్వరరావు, ఉమ్మిశెట్టి బాలకృష్ణ, బోలే అంజనేయులు, కోమట్ల త్రినాథ్‌రెడ్డి, అనూరాధ, మున్నంగి రమ్య, రాజు, పాలపర్తి రత్తయ్య, పి.నాగేశ్వరరావు, మారెడ్డి వీరారెడ్డి, కంచర్ల సుధాకర్ కరణం రమేష్, ఇస్తర్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



పోతవరంలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి

ఏసీపీ అవినీతిపై విచారణకు ఆదేశం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థలో అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)కేవీ వెంకటేశ్వర్లుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) ప్రవీణ్‌కుమార్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు సీడీఎంఏ ప్రవీణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణాధికారిగా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌ను సీడీఎంఏ నియమించారు. ఏసీపీ కేవీ.వెంకటేశ్వర్లుపై వచ్చిన అవినీతి, అక్రమాలను త్వరితగతిన విచారించి చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నగరంలోని కబాడిపాలెంకు చెందిన న్యాయవాది సుధీర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించమని సీడీఎంఏ ఆదేశాలు జారీ చేశారు.

ఆక్వా రైతుల సమస్యలు సీఎం దృష్టికి



బాలినేనితో మాట్లాడుతున్న ఆక్వా రైతులు, పక్కన కలెక్టర్, జేసీ

- ఆక్వా రైతులకు భరోసా ఇచ్చిన వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని
- ప్రభుత్వానికి లేఖ రాయాలని జిల్లా అధికారులకు సూచన

ఒంగోలు సబర్బన్: ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళతానని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు స్థానిక ఎన్‌ఎస్‌పి అతిథి గృహంలో మంగళవారం బాలినేనిని కలిసిన ఆక్వా రైతులు.. వాళ్ల ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జేసీ అభిషిక్త్‌కిషోర్, మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖరరెడ్డిల సమక్షంలోనే రైతులు ప్రభుత్వం ఇస్తున్న రూ.1.50 రాయితీలో కొంత ఇబ్బందులు జరుగుతున్నాయని వివరించారు. ఈ–ఫిష్ సర్వే, వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా ఆక్వా రైతులకు 10 ఎకరాల లోపు వారికి విద్యుత్ యూనిట్‌కు రూ.1.50 మాత్రమే వర్తించాలని పేర్కొన్నారు. అయితే కొంతమంది బడా సంస్థల వద్ద నుంచి తీసుకున్న కౌలు రైతులకు విద్యుత్ రాయితీ రావడం లేదని బాలినేని దృష్టికి తీసుకొచ్చారు. ఆక్వా రైతులకు సంబంధించిన అన్ని సమస్యలను ప్రభుత్వానికి లేఖ రూపంలో రాయాలని జిల్లా అధికారులకు బాలినేని సూచించారు. అనంతరం ప్రత్యేకంగా సీఎం వైఎస్ జగన్‌తో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడతానని రైతులకు బాలినేని భరోసా ఇచ్చారు. బాలినేనిని కలిసిన వారిలో కొత్తపట్నం, టంగుటూరు, ఒంగోలు మండలాలకు చెందిన రైతులు ఉన్నారు.

రహదారి భద్రత సామాజిక బాధ్యత

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: రహదారి భద్రత సామాజిక బాధ్యత అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల ముగింపును పురస్కరించుకొని మంగళవారం స్థానిక రవాణాశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ రహదారుల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కొన్ని కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోడ్డు వినియోగంపై అవగాహన కలిగి ఉండడంతో పాటు సమాజంలోని ఇతరుల్లోనూ చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకతను గుర్తించాలన్నారు. మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా మనతో పాటు రోడ్డు వినియోగించేవారు నిర్లక్ష్యంగా ఉంటే మనం కూడా రోడ్డు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివి వాహనదారుని ఏకాగ్రతను దెబ్బతీస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ భువనగిరి శ్రీకృష్ణవేణి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదన్నారు. రహదారిపై ప్రయాణించేటప్పుడు లేదా నడిచేటప్పుడు రహదారి భద్రతకోసం ఏర్పాటు చేసిన సిగ్నల్స్‌ను అనుసరించాలన్నారు. ప్రమాదాలు లేని సమాజం ప్రతి ఒక్కరి ఆశయం కావాలని, ఇందుకు సమాజంలోని ప్రతి వ్యక్తి తోడ్పాటు అవసరమన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంవీఐ కిరణ్ ప్రభాకర్, సురేంద్ర, ఏఎంవీఐ జయప్రకాష్, ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రమాదాలు ప్రమాదాలు జరగకుండా అనుసరించాల్సిన విధానాలు చిన్నారులకు వివరించారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నిషేధం

- ఉన్న ఫ్లెక్సీలన్నీ తొలగించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధంపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్లాస్టిక్ ఫ్లెక్సీలను ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో ఈ నెల 26 నుంచి జిల్లాలో ఎక్కడా ఫ్లెక్సీలు ఉండకూడదని, ఉన్న హోర్డింగులు, ఇతర ఫ్లెక్సీలను అధికారులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రకాశంభవనంలో ఫ్లెక్సీ ప్రింటర్లు, అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఫ్లెక్సీల ప్రింటింగ్‌తో పాటు ఇప్పటికే ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలన్నారు. ప్రకటనదారులు, ప్రదర్శనదారులు, ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్వాహకులు అధికారులకు సహకరించి ఫ్లెక్సీలను పూర్తిగా నివారించాలన్నారు. ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదన్నారు. ఏఎస్పీ నాగేశ్వరరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నాగిరెడ్డి, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్ ఉషారాణి, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇతర మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరైన విద్యార్థులకు శానిటైజర్ వేస్తున్న సెక్యూరిటీ



విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

● తొలిరోజు పరీక్షకు ఏడుగురు గైర్హాజరు

ఒంగోలు: జేఈఈ మెయిన్స్ పరీక్ష తొలిరోజు మంగళవారం ప్రశాంతంగా సాగింది. జిల్లాలో ఏకైక పరీక్ష కేంద్రమైన రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండు విడతల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించారు. ఉదయం షిఫ్టులో 121 మందికిగాను 116 మంది, మధ్యాహ్నం షిఫ్టులో 122 మందికిగాను 120 మంది హాజరయ్యారు. రెండు షిఫ్టుల్లో కలిపి ఏడుగురు గైర్హాజరయ్యారు. పరీక్ష సందర్భంగా పోలీసుశాఖతో పాటు కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేసి అభ్యర్థులకు ఎటువంటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.





విద్యార్థులను తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ





క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

యర్రగొండపాలెం: బైక్ అదుపు తప్పడంతో మహిళ మృతి చెందిన సంఘటన యర్రగొండపాలెంలోని పాల కేంద్రం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వీరభద్రాపురానికి చెందిన చప్పిడి చెన్నకేశవులు, ఆయన భార్య బుజ్జి, అత్త సంగాల వెంకటమ్మ(50) కలిసి వరి కోతల కోసం త్రిపురాంతకం మండలంలోని దూపాడుకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ సమయంలో యర్రగొండపాలెంలోని పాల కేంద్రం సమీపంలోని రోడ్డుపై మృతి చెందిన పందిని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వెంకటమ్మను మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తున్న సమయంలో ఆమె మార్గమధ్యంలో మృతి చెందింది.

మరో ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


జంగంవారిపల్లెలో ఓ కార్యక్రమానికి నంద్యాల జిల్లా సుండిపెంటకు చెందిన డి.శివరాములు, కె.రమేష్, డి.కోటయ్య హాజరై బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో వీరి బైక్ బోయలపల్లె వద్ద అదుపు తప్పి పడిపోయింది. ఈ సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

దుప్పి మాంసం స్వాధీనం

● ముగ్గురిపై కేసు నమోదు

రాచర్ల: చుక్కల దుప్పి మాంసంతోపాటు తలను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలోని సంగపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. సంగపేట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చుక్కల దుప్పిని వేటాడి మాంసాన్ని తరలిస్తున్నట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని చుక్కల దుప్పి తల, మాంసం స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టి బాలకృష్ణ, రంగస్వామి, ఎస్.రంగనాయకులును నిందితులుగా గుర్తించారు. మంగళవారం ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి మధుప్రియ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

వెలిగండ్ల: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో కంది పొలాల్లో పురుషుని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నాగిరెడ్డిపల్లికి రెండున్నర కిలో మీటర్ల దూరంలో ఉన్న ఓ కంది చేనులో గుర్తు తెలియని మృతదేహాన్ని గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్సై మహేష్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయసు 35 ఏళ్లు ఉంటాయని, చనిపోయి నాలుగైదు రోజులై ఉండవచ్చని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో వేగంగా అభివృద్ధి పనులు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

● అభివృద్ధి లేదనే వారు కళ్లు లేని కబోధులు
● గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మంచి స్పందన
● 33 డివిజన్‌లో సంక్షేమ పథకాల ద్వారా రూ.10 కోట్ల అందజేత
● వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలోని 33వ డివిజన్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ముంగమూరు రోడ్డులోని జెడ్పీ కాలనీ, ముంగమూరు మెయిన్ రోడ్డు, దత్తసాయి నగర్‌లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వస్తున్న తీరును స్వయంగా బాలినేని స్థానికులకు వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, జరుగుతున్న అభివృద్ధి పనులపై నేరుగా బాలినేని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బాలినేని మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి జరగడం లేదనే వారు కళ్లు లేని కబోధులని ఎద్దేవా చేశారు. సచివాలయాల సిబ్బంది బాగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంత కుమారి విజయభాస్కర్ రెడ్డిలు బాగా పని చేస్తున్నారని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పరిపాలన గురించి ప్రజల నుంచే సమాధానాలు రాబట్టారు. సీఎం వైఎస్ జగన్ పాలనను చూసి టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు ఊపందుకున్నాయన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మా పార్టీకి ఓటు వేసినా, వేయకపోయినా అర్హులందరికీ ఏదో ఒక పథకం ప్రతి ఇంటి గడపకు వచ్చి చేరుతుందన్నారు. ప్రతి పేదవాడి ఇంట్లో ఆనందం చూడాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. నవరత్నాల పేరుతో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, హామీ ఇవ్వని ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అందిస్తూ ముందుకు సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంత కుమారి విజయ భాస్కర రెడ్డి డివిజన్‌లోని పరిస్థితులను బాలినేనికి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, గంటా రామానాయుడు, కార్పొరేటర్లు యనమల నాగరాజు, గిరిజా శంకర శాండిల్య, నీలంరాజు సరోజ, వేమూరి భవాని, తాడి కృష్ణలత, ఫాతిమా, రషీదా, ట్రేడ్ యూనియన్ నాయకులు జాజుల కృష్ణ, పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దామరాజు క్రాంతి కుమార్, గౌరైపాటి శ్రీనివాసరావు, కొమ్మూరి రవిచంద్ర, తమ్మినేని మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, అమ్మిశెట్టి ఆంజనేయులు, కార్పొరేషన్ డైరెక్టర్ కరుణాకర్, కర్నేటి ప్రసాదు, కేవీ రమణారెడ్డి, ఊసా మధుబాబు, బైరెడ్డి అరుణ, పల్లా అనూరాధ, చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, తిర్లిక శ్రీనివాసరావు, తోటపల్లి సోమశేఖర్, అద్దేపల్లి సురేష్, డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు పందిటి కాశీరామ్(జేమ్స్), మిలటరీ కాలనీ ఎస్‌కే నాగూర్, ఓగిరాల శ్రీనివాసులు, జయరామిరెడ్డి, కోటా రాంబాబు, నగేష్, ముంతాజ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, రమాదేవి, మద్దులూరి వెంకటేశ్వర్లు, శోభ, ఏసు, బక్కా రోశయ్య, బాబూరావు, పింగల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వెలగలపాయ లోయలో పెద్దపులి సంచారం

● ఆందోళనలో పరిసర గ్రామాల ప్రజలు
● నాలుగు రోజుల వ్యవధిలో ఎద్దులపై రెండుసార్లు దాడి



మాగుటూరు అటవీ ప్రాంతంలో ఎద్దు కళేబరాన్ని తింటున్న పెద్దపులి (ట్రాప్ కెమెరాలో నిక్షిప్తమైన దృశ్యం)

అర్ధవీడు(కంభం): మండలంలోని మాగుటూరు, కాకర్ల, వెలగలపాయ గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుండటంతో రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నాలుగు రోజుల క్రితం మాగుటూరు గ్రామానికి చెందిన రైతు భోగెం గురుస్వామికి చెందిన ఎద్దు పెద్దపులి దాడి చేయడంతో మృతి చెందింది. ఎద్దు పులిదాడిలో మృతి చెందిందా లేదా అన్న విషయాన్ని తెలుసుకోవడం కోసం అధికారులు సంఘటనా స్థలం వద్ద ట్రాప్ కెమెరాలు అమర్చారు. పెద్దపులి మరోసారి ఎద్దు మృతదేహం వద్దకు వచ్చి కళేబరాన్ని తింటుండటం కెమెరాలో నిక్షిప్తమైంది. దీంతో అటవీశాఖ అధికారుల అప్రమత్తమై పరిసర ప్రాంతాల్లోని రైతులు, ప్రజలను అప్రమత్తం చేశారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం వెలగలపాయ కొండ సమీపంలో ఎద్దులను మేతకు తీసుకెళ్లగా ఓ ఎద్దుపై పెద్దపులి దాడి చేస్తున్న సమయంలో చూసిన రైతు కంపిలి బాలేశ్వరరావు కేకలు వేయడంతో పులి పారిపోయింది. గాయపడ్డ ఎద్దుకు వెటర్నరీ సిబ్బంది చికిత్స చేశారు. నాలుగు రోజుల వ్యవధిలో పెద్దపులి రెండుసార్లు పశువులపై దాడికి పాల్పడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పెద్దపులి గ్రామాల్లోకి ప్రవేశించక ముందే అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుని పశువులకు, ప్రజలకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.



పులి దాడిలో గాయపడిన ఎద్దును చూపిస్తున్న రైతు బాలేశ్వరరావు



వెలగలపాయలో పులి దాడిలో ఎద్దు కాలికి అయిన గాయం

అధికారులు రక్షణ కల్పించాలి

పశువుల మేత కోసం రెండు జతల ఎద్దులను అడవికి తీసుకెళ్లా. ఎద్దులు మేత మేస్తున్న సమయంలో పెద్దపులి వచ్చి పంజాతో కాళ్లపై దాడి చేస్తుండగా నేను పెద్దగా కేకలు వేయడంతో పారిపోయింది. మాది మారుమూల ప్రాంతం. ఇక్కడ పులి తిరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలి.

– కంపిలి బాలేశ్వరరావు, వెలగలపాయ

బాలికా దినోత్సవం పోటీల్లో విజేతలకు బహుమతులు



జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం,చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులతో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, డీఎంహెచ్‌ఓ ఎస్.రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు కలెక్టర్ దినేష్‌కుమార్ బహుమతులు అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకాశం భవనంలో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. 'ఆడ పిల్లలను కాపాడదాం–ఆడ పిల్లలను పరిరక్షిద్దాం' అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. మొదటి బహుమతి పొందిన విద్యార్థులు సీహెచ్ మమత, టి.జస్వంత్, బి.పరిమళ, రెండో బహుమతి పొందిన సీహెచ్ అమృత, సీహెచ్ మమత, టి.సిరి, మూడో బహుమతి పొందిన కె.హంపి, ఎస్.సాయిసహస్ర, పి.అనుపమను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డాక్టర్ మాధవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం





మృతులు పెద్ద సుబ్బరాయుడు, పెద్ద మౌలాలి(ఫైల్)



మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

తర్లుపాడు: పొట్టకూటికి బయలుదేరిన ఇద్దరు యువకులను ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు బలితీసుకుంది. ఈ సంఘటన తర్లుపాడు మండలంలోని లింగారెడ్డి కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. మార్కాపురం పట్టణానికి చెందిన పెరిగే పెద్దసుబ్బరాయుడు(30), విభూది పెద్ద మౌలాలి(29) ప్లాస్టిక్ బిందెల వ్యాపారం నిమిత్తం బైక్‌పై ఒంగోలు వెళ్తున్నారు. మార్కాపురం నుంచి ఒంగోలు వెళ్తున్న గెలాక్సీ బస్సు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని పొదిలి సీఐ సుధాకర్ బాబు, తాడివారిపల్లి ఎస్సై ముక్కంటి పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడు పెరిగె పెద్దసుబ్బరాయుడికి భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు, పెద్ద మౌలాలికి భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు సంతానం ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు వైద్యశాలకు చేరుకుని బోరున విలపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒంగోలు నగరపాలక సంస్థ, ఒంగోలు

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్

నెం.929/2022-23 నుండి 967/2022-23 వరకు, తేది.24.01.2023

			టెండర్ నోటీస్ నెం. 929/2022-23 నుండి 932/2022-23 వరకు	టెండర్ నోటీస్ నెం. 933/2022-23 నుండి 967/2022-23 వరకు
1.	మొత్తం పనుల సంఖ్య	:	4	35
2.	మొత్తం పనుల అంచనా విలువ	:	రు.51.40 లక్షలు	రు.366.25 లక్షలు
3.	'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో టెండర్ షెడ్యూల్ లభ్యమగు ప్రారంభ తేది	:	25.01.2023 సాయంత్రం 4 గం.నుండి	25.01.2023 సాయంత్రం 4 గం.నుండి
4.	'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో టెండర్ షెడ్యూల్ లభ్యమగు చివరి తేది	:	01.02.2023 సాయంత్రం 4 గం.వరకు	09.02.2023 సాయంత్రం 4 గం.వరకు
5.	'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో ఆన్‌లైన్ ద్వారా బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయము	:	01.02.2023 సాయంత్రం 4.15 గం.ల వరకు	09.02.2023 సాయంత్రం 4.15 గం.ల వరకు
6.	టెక్నికల్ బిడ్ తెరుచుటకు నిర్ణయించిన తేది మరియు సమయము			09.02.2023 సాయంత్రం 4.30 గం.లకు
7.	ప్రైస్ బిడ్ తెరుచుటకు నిర్ణయించిన తేది మరియు సమయము	:	01.02.2023 సాయంత్రం 4.30 గం.లకు	09.02.2023 సాయంత్రం 4.45 గం.లకు

ఇతర వివరములకు సంప్రదించవలసిన చిరునామా www.apeprocurement.gov.in వివరములకు : 98499 06599

కమిషనర్, ఒంగోలు నగరపాలక సంస్థ